క్లుప్తంగా

సంపూర్ణ అవగాహనతో ఆరోగ్యకరమైన జీవనం

● డాక్టర్ పల్లవి


శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

విజయనగరం: మహిళలు, అమ్మాయిలు నెలసరి పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే ఆరోగ్యకరంగా ఉంటారని లంకాపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పల్లవి అన్నారు. రుతక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నాప్‌కిన్స్ వాడకంపై లంకాపట్నం, రాజీవ్‌నగర్ కాలనీ, ఫూల్‌బాగ్ కాలనీ, బీసీ కాలనీల్లో గల ఆరోగ్య కేంద్రాల్లో ఆదివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పల్లవి మాట్లాడుతూ, ప్రకృతి సిద్ధమైన రుతుక్రమాల పట్ల బిడియాన్ని, అపోహలను విడనాడాలని సూచించారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, ఆరోగ్య కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర జాతాను విజయవంతం చేయండి

విజయనగరం ఫూల్‌బాగ్: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న రాష్ట్ర జాతాను విజయవంతం చేయాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ. జగన్‌మోహన్‌రావు, బి.రమణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు నాయకత్వంలో రాష్ట్ర జాతా నిర్వహిస్తామన్నారు.

చిన్నారుల ప్రతిభ


ఆటోమేటిక్ వాటర్ ప్లాంట్ ప్రాజెక్ట్‌తో విద్యార్థులు, లైబ్రేరియన్

డెంకాడ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వివిధ రకాల పుస్తకాలు చదవడంతో పాటు నూతన ఆలోచనలకు పదును పెడుతున్నారు. పలువురు విద్యార్థులు ఆటోమేటిక్ వాటర్‌ప్లాంట్‌ను తయారు చేసి ఆకట్టుకున్నారు. వీరిని లైబ్రేరియన్ మహేష్ అభినందించారు.

వేడుకగా సంఘ ఆవిర్భావ దినోత్సవం


ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్ అలజంగి రవికుమార్, తదితరులు

విజయనగరం టౌన్: ఏసు ప్రేమాలయం ఆధ్వర్యంలో స్థానిక అంబటిసత్రం వద్ద ఉన్న చర్చి ఆవరణలో ఆదివారం సంఘ ఆవిర్భావ దినోత్సవం (చర్చి ఫార్మేషన్ డే) ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ ఎ.సునీల్ కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ అలజంగి రవికుమార్, సువర్ణలు కేక్ కట్ చేసి అందిరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో చర్చి ప్రతినిధులు కోరాడ నాగేశ్వరరావు, జాను, సుజాన్, దేవరాజు, శ్రీనివాస్, అధిక సంఖ్యలో క్రీస్తు సోదరులు పాల్గొన్నారు.

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

బొండపల్లి: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే) ద్వారా రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఏఓ పి.వి.మల్లికార్జునరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పిల్లి పెసర, కట్టి జనుము, జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఖరీఫ్ వరి పంట సాగుకు ముందు భూసారం పెంచేందుకు వీటిని సాగు చేసుకోవాలని సూచించారు.

అమ్మవారికి అభిషేకాలు


అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ ఆధ్వర్యంలో ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద పర్యవేక్షణలో అమ్మవారికి ప్రతీ ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

ఆదాయం అంతంతమాత్రమే..


నగరంలోని దుకాణ సముదాయాలు

- నగరంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న దుకాణాలు
- లైసెన్స్‌లు తక్కువ.. దుకాణాలు ఎక్కువ
- ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో చూసిచూడనట్లు వ్యవహరిస్తున్న కార్పొరేషన్ అధికారులు

విజయనగరం:

కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో పుట్టగొడుగుల్లా దుకాణాలు వెలుస్తున్నప్పటికీ ఆ స్థాయిలో ఖజానాకు ఆదాయం సమకూరడం లేదు. రోజురోజుకూ విస్తరిస్తున్న నగరంలో ఎక్కడపడితే అక్కడ వివిధ రకాల దుకాణాలున్నప్పటికీ లైసెన్స్‌లు లేకుండానే వ్యాపారాలు సాగిపోతుండటం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రతి ఏడాదీ కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయానికి పెద్ద ఎత్తున గండిపడుతోంది. నిబంధనల ప్రకారం నగరంలో ఏ దుకాణం నడపాలన్న కార్పొరేషన్ నుంచి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌ను వ్యాపారులు తగిన మొత్తం చెల్లించాలి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో లైసెన్స్‌ల మంజూరు ప్రక్రియపై సంబంధిత అధికారులు ఉదాసీనతతో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కనీసం ఉన్నతాధికారులైన స్పందించి లైసెన్స్‌ల మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించి, ఆదాయం మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వసూళ్లలో వైఫల్యం...

గడిచిన ఐదేళ్లలో పరిశీలిస్తే కార్పొరేషన్ ఖజానాకు ట్రేడ్ లైసెన్స్‌ల రూపంలో రావాల్సిన ఆదాయం అంతంతమాత్రంగానే ఉంది. 2018-19 సంవత్సరం నుంచి పరిశీలిస్తే అప్పట్లో 1600 వరకు దుకాణాలు, షాపులు ట్రేడ్ లైసెన్స్‌ల పరిధిలోకి వస్తే.. 2022-23 సంవత్సరం నాటికి ఆ సంఖ్య 2219కి చేరింది. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో పాత, కొత్త బకాయిలు కలుపుకుని రూ.1.50 కోట్లు ఆదాయం రావాల్సి ఉండగా.. ఇప్పటివరకు రూ.13.23 లక్షలు మాత్రమే వసూలైంది. 2018 – 19 సంవత్సరంలో రూ.18.77 లక్షల డిమాండ్‌కు గాను రూ.12.51 లక్షలు.. 2019-20 సంవత్సరంలో రూ.20.13 లక్షలకు గాను రూ.13.52 లక్షలు.. 2020-21 సంవత్సరంలో రూ.20.39 లక్షలకు గాను రూ.12.13 లక్షలు.. 2021-22 సంవత్సరంలో రూ.21.49 లక్షలకు గాను రూ.11.22 లక్షలు.. 2022-23 సంవత్సరంలో రూ.25.08 లక్షలకు గాను రూ.13.23 లక్షలు మాత్రమే వసూలు కావడం గమనార్హం.

దుకాణాలు పెరుగుతున్నా ఆదాయం పెరగదేం...?

జిల్లా కేంద్రం, ఆపై కార్పొరేషన్ హోదా దక్కించుకున్న నగరం విజయనగరం. ఆ స్థాయికి దక్కట్లే స్థానిక ప్రజాప్రతినిధులు అన్ని రంగాల్లో నగరాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపడుతున్నారు. గడిచిన నాలుగేళ్లలో నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు నగర రూపురేఖలు చాలా వరకు మారాయి. పెద్ద పెద్ద నగరాలకు దీటుగా ప్రధాన కూడళ్లు సందరంగా రూపుదిద్దుకున్నాయి. ఈ భారాన్ని అధిగమించేందుకు వీలుగా ఆదాయ మార్గాలను పెంచుకునే దిశగా చర్యలు చేపట్టడంలో కార్పొరేషన్ యంత్రాంగం విఫలమవుతోంది. రెస్టారెంట్లు, హోటళ్లు, కిరాణా దుకాణాలు, వస్త్ర దుకాణాలు, ఆన్‌లైన్ సెంటర్లు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, కల్యాణ మంటపాలు, మొబైల్ షోరూమ్‌లు, టిఫిన్ సెంటర్లు, వాహన షోరూమ్‌లు, రిపేర్ సెంటర్లు, తదితర దుకాణాలు ట్రేడ్ లైసెన్స్‌ల పరిధిలోకి వస్తుండగా... ఆ స్థాయిలో ఆదాయాన్ని సమకూరడం లేదు.

లైసెన్స్ తప్పనిసరి..

నగరంలో వ్యాపారాలు సాగించే ప్రతి దుకాణదారుడు, వాణిజ్య సంస్థల నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు సాగిస్తే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. విస్తరిస్తున్న నగరంలో రోజురోజుకూ దుకాణాల సంఖ్య పెరుగుతోంది. వ్యాపారులు ముందుకొచ్చి అనుమతి పొందాలి. విధిగా లైసెన్స్‌లు తీసుకోవాలి. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటాం.

– రెడ్డి శ్రీరాములనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్


డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తన జన్మదిన సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి క్షేత్రాన్ని ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. – విజయనగరం

రామతీర్థంలో ప్రత్యేక పూజలు


హోమం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాతఃకాలాఅర్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగ మందిరంలో ఆదిత్య హృదయం, సుందరాకాండ హవనం, తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం వెండి మంటపం వద్ద సీతారామస్వామిని నూతన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి నిత్య కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో రామతీర్థం భక్తులతో కిటకిటలాడింది. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, రామగోపాలాచార్యులు పాల్గొన్నారు.

శతశాతం ఫలితాల సాధనే లక్ష్యం

బాడంగి: వచ్చే నెలలో జరగనున్న సప్లిమెంటరీ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి.రామదాసు చెప్పారు. ఆదివారం స్థానిక గురుకుల పాఠశాలలో పదో తరగతి తప్పిపోయిన విద్యార్థులకు జరుగుతున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ ఏడాది పబ్లిక్ పరీక్షల్లో తప్పిపోయిన విద్యార్థులకు ఈ నెల 5వ తేదీ నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని తమ పాఠశాలతో పాటు సాలూరు, కొప్పెర్ల, ఎస్సీ వసతి గృహాలకు చెందిన విద్యార్థులంతా ఇక్కడే చదువుతున్నట్లు చెప్పారు. ఈ నెలాఖరు 31వ తేదీతో ప్రత్యేక తరగతులు ముగుస్తాయన్నారు.

అన్నార్తులను ఆదుకోవడం అందరి బాధ్యత

- నగరంలోని కొత్తపేట జంక్షన్‌లో ఫుడ్‌బ్యాంక్ ప్రారంభం


అన్నార్తులకు ఆహారాన్ని వడిస్తున్న శ్రావణి, కౌశిక్, తదితరులు

విజయనగరం: అన్నార్తులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ అన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జన్మదినం సందర్భంగా కొత్తపేట నీళ్లట్యాంక్ వద్ద నగరంలోని ఆరో ఫుడ్‌బ్యాంక్‌ను డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్ లాంఛనంగా ప్రారంభించి, పేదలకు ఆహారాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ, నగరంలో ఇప్పటికే ఐదు చోట్ల ఫుడ్ బ్యాంకులు నెలకొల్పామన్నారు. తాజాగా ఆరో ఫుడ్‌బ్యాంక్ ఏర్పాటు చేవామని చెప్పారు. ప్రజాసేవే ధ్యేయంగా సాగుతున్న కోలగట్ల ఆశయ సిద్ధి కోసం తామంతా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఈసరపు రేవతీదేవి, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు ముద్దాడ మధు, ముచ్చు శ్రీనివాసరావు, బండారు ఆనందరావు, పలు డివిజన్ల కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం

- నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని


ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ సరోజిని, తదితరులు

నెల్లిమర్ల: మహిళలు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునని నెల్లిమర్ల నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని అన్నారు. ప్రపంచ నెలసరి దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వార్డు మహిళా కార్యదర్శులు, వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, మెప్మా ఆర్‌పీలకు స్థానిక నగరపంచాయతీ కార్యాలయంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సరోజిని మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అనంతరం రామతీర్థం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ పి.బాలాజీప్రసాద్, మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, మెప్మా సీఎంఎం డి. గోవిందరావు పాల్గొన్నారు.

శిష్టకరణ సంఘ అభ్యున్నతికి కృషి చేయండి


మాట్లాడుతున్న సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు

విజయనగరం టౌన్: జిల్లాలో శిష్టకరణ సంఘ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి యాలని సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక బృందావనం అపార్ట్‌మెంట్‌లో ఉన్న కమ్యూనిటీ హాల్‌లో సంఘ నూతన కార్యవర్గ తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిష్టకరణ కులాన్ని ఓబీసీలో చేర్పించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న కులాన్ని బలోపేతం చేసేందుకు సంఘ సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రేగ సురేష్, గౌరవాధ్యక్షుడు ఆర్. ఆనందపట్నాయక్, కోశాధికారి వాండ్రంగి వెంకటేష్, ఉపాధ్యక్షుడు ప్రభాత్ పట్నాయక్, ప్రతినిధులు బగ్గం సుధాకరరావు, ప్రసాద్, మోహనరావు, విశ్వేశ్వరరావు, సీహెచ్. త్రినాథప్రసాద్, సంజీవరావు, సునీత, తదితరులు పాల్గొన్నారు.

భారవి కవితా వైభవం ఎంతో గొప్పది


డాక్టర్ సరిపల్లి అనూషను సత్కరిస్తున్న విజయభావన సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: మహాకవి భారవి కవితా వైభవం వేనోళ్ల కొనియాడదగినదని గాయత్రీ డిగ్రీ కళాశాల సంస్కృత ఉపన్యాసకురాలు డాక్టర్ సరిపల్లి అనూష అన్నారు. విజయభావన సాహితీమిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం రాత్రి భారవి కవితా వైభవంపై సాహితీ సదస్సు నిర్వహించారు. భారవి జీవిత విశేషాలతో పాటు అతను రాసిన కిరాతార్జునీయ కావ్యంలో ఉన్న కవితా విశేషాలను వివరించారు. బ్రహ్మశ్రీ రాళ్లపల్లి రామసుబ్బారావు సభాధ్యక్షత వహించారు. సమాఖ్య కోశాధికారి దశగ్రంథాల వేంకట సుబ్రహ్మణ్యం సమన్వకర్తగా వ్యవహరించారు. అనంతరం సరిపల్లి అనూషను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో విజయభావన ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు, డాక్టర్ జక్కు రామకృష్ణ, దేవరాజు గోపాలకృష్ణ, అధిక సంఖ్యలో సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ మరణానికి కారకుడు చంద్రబాబే..


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: మాజీ ముఖ్యమంత్రి, దివంగత ఎన్టీఆర్ మరణానికి కారకుడైన చంద్రబాబుకు ఆయన శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనే అర్హత లేదని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పక్కిలో ఎన్టీఆర్ విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అప్పట్లో ఎన్టీఆర్‌ను పదవీవిచ్యుతుడిని చేయడానికి చంద్రబాబు కుయుక్తులు పన్నారన్నారు. ఆ సమయంలో ప్రజలు తిరగబడటంతో రామోజీరావు, చంద్రబాబు కాస్త వెనక్కి తగ్గినా.. తర్వాత ఆయన మరణానికి కారణమయ్యారన్నారు.

పేదలకు న్యూట్రిషన్ బాటిల్స్, తువ్వాళ్ల పంపిణీ..

పట్టణంలోని టీటీడీ కల్యాణ మంటపం వద్ద మదర్ థెరీసా ట్రస్ట్ సీఈఓ కల్లేప్ కూపర్ రిక్షా కార్మికులు, పేదలకు న్యూట్రిషన్ బాటిళ్లు, తువ్వాళ్లను పంపిణీ చేశారు. కనక మహేష్ పట్నాయక్, పీసీసీ సభ్యుడు మువ్వల శ్రీనివాసరావు, జి.పోలీసు, శ్రీనివాస్, పాణిగ్రాహి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోలగట్ల జన్మదిన వేడుకలు

- వాడవాడలా సేవా కార్యక్రమాలు


డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

విజయనగరం: ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నగరంలోని వాడవాడలా సేవా కార్యక్రమాలు నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ముందుగా రింగ్‌రోడ్డు సాయిబాబా ఆలయం వద్ద తూర్పు కాపు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఫూల్‌బాగ్ మంగళవీధి కాలనీ పాఠశాలలో ఉచిత వైద్య, నేత్ర శిబిరాలను నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. 16వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ చేయగా....గంటస్తంభం జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు ఆధ్వర్యంలో పేదలకు చెప్పులు పంపిణీ చేశారు. అనంతరం బీపీఎం కార్పొరేషన్ పాఠశాలలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సర్వజన ఆస్పత్రి, ఘోషాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బాబామెట్టలో ఉన్న ఏటీకే వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. అదే విధంగా వివిధ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి పేదలకు అన్నసంతర్పణ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం కోలగట్ల స్వగృహంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కోలగట్ల శ్రావణి కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు.

మీ అభిమానానికి ధన్యులం : డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

ఇంతమంది ప్రజల ప్రేమాభిమానాలు సొంతం చేసుకోవడం ఎన్నో జన్మల పుణ్యఫలమని.. ఇంతటి ఆదరణ తమ కుటుంబంపై ఎల్లవేళలా ఉండాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆకాంక్షించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల అభిమానమే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జన్మదిన వేడుకలు ఘనంగా జరగడం సంతోషదాయకమన్నారు.


విజయనగరం రూరల్: డిప్యూటీ స్పీకర్ కోలగట్ల జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కాపు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఘనంగా..

విజయనగరం రూరల్: ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ ఆధ్వర్యంలో చెల్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, విజయనగరం ఏఎంసీ చైర్‌పర్సన్ నడిపేన శశిభార్గవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, తదితరులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వెయ్యి మందికి గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బోద అప్పలకృష్ణ, బొంతు పైడినాయుడు, బంటుపల్లి శ్రావణి, రవి, కోరాడ వేణుబాబు, బంగారయ్య, కె. రమణ, మోపాడ ఆదినారాయణ, బోడసింగి మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీలు

వేపాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ సోమునాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించామని చెప్పారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. విద్యార్థులు గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గరివిడి ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాల 1990-93 బ్యాచ్ విద్యార్థులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాల 1990-93 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం పేరిట మూడు దశాబ్దాల తర్వాత ఆ కళాశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. డిగ్రీ పూర్తయిన తర్వాత వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా 30 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. యోగక్షేమాలు, కుటుంబ జీవితం గురించి అంతా ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి అధ్యాపకులు సూర్యనారాయణ, జి.ఎన్. రాజు, జి.ఎల్.ఎన్.రాజు, నారు సింహాద్రినాయుడు, కె.చంద్రమౌళీశ్వరరావు తదితరులను సన్మానించారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు.

కలవచర్ల ఉన్నత పాఠశాల 1999 బ్యాచ్ కలయిక

గుర్ల: మండలంలోని కలవచర్ల జిల్లా ఉన్నత పాఠశాలలో 1999లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం ఆ పాఠశాల వేదికగా ఆదివారం జరిగింది. రెండు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో అంతా భావోద్వేగానికి లోనయ్యారు. ఆ నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమ తోటి మిత్రుల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు.

జీపీఎల్ విజేత పెందుర్తి


విజేత పెందుర్తి జట్టుకు ట్రోఫీతో పాటు నగదు బహుమతి అందిస్తున్న పెద్దలు

- విజేతకు రూ.50 వేల నగదు బహుమతి

గజపతినగరం: జీపీఎల్ (గజపతినగరం ప్రీమియర్ లీగ్) క్రికెట్ టోర్నమెంట్ విజేతగా విశాఖపట్నం జిల్లాకు చెందిన పెందుర్తి జట్టు నిలిచింది. గతకొద్ది రోజులుగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జీపీఎల్ ఆదివారం ఫైనల్స్‌తో ముగిసింది. జోనల్ స్థాయిలో పలుజట్లు పాల్గొనగా ఫైనల్స్‌కు గజపతినగరం, పెందుర్తి జట్లు చేరుకున్నాయి. ఫైనల్స్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పెందుర్తి జట్టు 12 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 109 పరుగులు చేసింది. లక్ష్యసేదనలో గజపతినగరం జట్టు 8.3 ఓవర్లలో 32 పరుగులకు ఆలౌట్ అయింది. విజేత పెందుర్తి జట్టుకు నిర్వాహకులు రూ.50వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేశారు. రన్నర్ గజపతినగరం జట్టుకు రూ. 25 వేల నగదు బహుమతిని అందజేశారు. బహుమతి ప్రధానోత్సవంలో పురిటిపెంట, గజపతినగరం, మదుపాడ గ్రామపెద్దలు మండల సురేష్, కర్రి నానాజీ, కడుపుట్ల పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.